
సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 1 । మే । 2023



అరకొరగా ఎగుమతులు

కొబ్బరి ఈనెల ఎగుమతులు పడిపోయాయి. కొబ్బరి రైతు దిగాలు పడుతున్నాడు.

- 8లో



వేర్వేరు ఘటనల్లో..

జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. ఆయా ప్రాంతాల్లో విషాదం అలముకుంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	34°	25°
ఇచ్ఛాపురం	36°	25°
పాతపట్నం	35°	24°
శ్రీకాకుళం	35°	24°

న్యూస్‌రీల్

విద్యార్థులకు వరం 'ఇంటరాక్టివ్ ప్యానెల్'



మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య

గార: విద్యార్థులకు ఇంటరాక్టివ్ ప్యానెల్ వరం అని, సులువుగా అర్థం చేసుకునేందుకు సహాయ పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య అన్నారు. ఆదివారం కె.మత్స్యలేశం యూపీ స్కూల్‌కు గ్రామస్తులు రూ.లక్షానలభై వేలుతో కొనుగోలు చేసిన ఇంటరాక్టివ్ ప్యాన్‌ల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులు చేయడంలో భాగంగా ఈ ప్యానెల్స్ రాష్ట్రంలో తొలి విడతగా 30 వేల పాఠశాలలకు మంజూరు చేశారని తెలిపారు. దీని వల్ల వీడియో పాఠాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాఠ్యాంశాల బోధన, మల్టీపర్పస్ వినియోగం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉంటుందని, గ్రామస్తులు నిధులు సమకూర్చడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత, ఎంఈఓ ఎం.సోమేశ్వరరావు, రామచంద్రరరావు, కెప్టెన్ మైలపల్లి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర గళార్చన



సహస్ర గళార్చన చేస్తున్న సాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న బాలవికాస్ సంబరాల సందర్భంగా సాయంత్రం వెయ్యి మంది సభ్యులతో సహస్ర గళార్చన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయిపై పాటలను ఆలపించారు. అలాగే చిన్నారులు నృత్యాల ప్రదర్శన కూడా జరిగింది.


పిల్లలకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ



మాకువ ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు, తల్లులు

సారవకోట: ఇదివరకు ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో కూడా జరిగింది. ఆదివారంతో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పనిదినాలు పూర్తయ్యాయి. మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివారం ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. ఎంఈఓ ఎంవీ రమణ గుమ్మపాడు పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేసి వేసవి సెలవులలో విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని సూచించారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.

రబీ వరి దిగుబడి బాగు



ఉర్లాం వద్ద కోసిన వరి పంట నుంచి వచ్చిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో వేస్తున్న కోత మిషన్

నరసన్నపేట: ఖరీఫ్‌తో పోల్చితే రబీలో వరి దిగుబడి బాగా పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 32 నుంచి 36 బస్తాల వరకూ దిగుబడి వచ్చిందని అంటున్నారు. నరసన్నపేట మండలంలో ఎక్కువగా రైతులు ఆర్ఎస్ఆర్ వరి రకాన్ని వేశారు. సుగర్ లెస్ ధాన్యం కావడంతో బహిరంగ మార్కెట్‌లో ధర కూడా ఆశాజనకంగా ఉంది. కంబకాయ, కరగాం, నారాయణవలస, అంప్లాం, ఉర్లాం, మాకివలస, గొట్టిపల్లి, బుచ్చిపేట, నర్సింగపల్లితో పాటు పలు గ్రామాల్లో రబీ వరి వేశారు. ప్రస్తుతం కోత దశలో పంట ఉంది. పలు గ్రామాల్లో యంత్రాల సహకారంతో కోతలు చురుగ్గా నిర్వహిస్తున్నారు.

మైదానం పిలుస్తోంది



వాలీబాల్ సాధనలో క్రీడాకారులు



కబడ్డీ సాధనలో బాలికలు

- నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో నెలరోజుల పాటు శిక్షణకు చర్యలు
- జిల్లాలో ఆదరణ కలిగిన 20 క్రీడాంశాలకు అవకాశం
- ఒక్కో శిబిరానికి రూ. 7వేలు చొప్పున కేటాయింపు

శ్రీకాకుళం న్యూకాలనీ: బడి తలుపులు మూసివేసిన వేళ మైదానం నుంచి పిల్లలకు పిలుపు అందుతోంది. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులను తన ఒడిలోకి ఆహ్వానిస్తోంది. బాలలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ ఏడాది కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు శాప్ సూచనలతో పకడ్బందీగా సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి నెలరోజులపాటు..

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో మే నెలాఖరు వరకు ఈ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున కేటాయించారు. ఈ మొత్తాన్ని శిబిరం వద్ద అవసరమైన క్రీడాపరికరాలు, క్రీడా సామగ్రి, ఇతర మౌలిక సదుపాయాలకు వెచ్చించనున్నారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు పోటీలను నిర్వహిస్తారు. ఆఖర్లో సర్టిఫికెట్లను అందజేస్తారు.

విధివిధానాలు ఇవి..

- సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లలో 8 నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ అందిస్తారు. 16 ఏళ్ల పైబడి ఆసక్తి కలిగిన వారు కూడా హాజరుకావచ్చు.
- ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 వరకు, మళ్లీ సాయంత్రం 5 నుంచి 7 వరకు శిక్షణను అందించాలి.
- శాప్ కోచ్‌లతోపాటు పీడీలు/పీఈటీలు, నేషనల్ ప్లేయర్స్, సీనియర్స్ ప్లేయర్స్ వారివారి క్రీడాంశాల్లో శిక్షణను అందించేందుకు అర్హులు.
- ప్రతి రోజు శిక్షణకు హాజరయ్యే క్రీడాకారులకు హాజరు వేయాలి.
- నెలరోజుల శిక్షణలో వారాంతాల్లో క్రీడాకారులకు పోటీలను నిర్వహించి ప్రోత్సహించాలి.
- శిబిరాల సమయంలో గ్రామీణ స్థాయి, పాఠశాల స్థాయి స్పోర్ట్స్ క్లబ్‌లను క్రీడాంశాల వారీగా ఏర్పాటు చేయాలి.
- శిక్షణ శిబిరాల సమయంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రత్యేకంగా సానబెట్టి భవిష్యత్‌లో జరిగే పోటీలకు సిద్ధం చేయాలి.



సాఫ్ట్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు

గ్రామీణ క్రీడలకు పెద్దపీట..



జిల్లాలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ల కేటాయింపులో గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేశారు. అత్యధికంగా వాలీబాల్‌కు 7 కేంద్రాలను కేటాయించారు. అలాగే సాఫ్ట్‌బాల్ 5, కబడ్డీ 4, అథ్లెటిక్స్‌కు 4, బ్యాడ్మింటన్‌కు 3, తైక్వాండో 4, బాల్ బాడ్మింటన్ 3, హ్యాండ్ బాల్ 3, ఖోఖో 2, ఫుట్‌బాల్ 2, బేస్‌బాల్‌కు 2, బాక్సింగ్ 2, జూడో 2, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, నెట్‌బాల్, టెన్నీకాయిట్, రగ్బీ, సెపక్‌తక్ర, ఉషూ క్రీడాంశాలల్లో చెరో కేంద్రం చొప్పున శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లో పాఠ శాలల మైదానాల్లోనే శిక్షణను అందించనున్నారు.

ఆకస్మిక తనిఖీలు చేపడతాం



ఒలింపిక్ అసోసియేషన్ నాయకులతో కలిసి శిక్షణ కేంద్రాల నిర్వహణ, తీరుపై ఆకస్మిక తనిఖీలు చేపడతాం. తనిఖీల్లో కోచ్‌లు, క్రీడాకారులు అందుబాటులో లేకుంటే ఆ శిక్షణ కేంద్రాన్ని రద్దు చేస్తాం. కేంద్రానికి కేటాయించే రూ.7వేలు కూడా రద్దు చేస్తాం. నిర్దేశించిన సమయాల్లో శిక్షణను తప్పనిసరిగా అందించాలి.

– బీవీ ప్రసాదరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ, శ్రీకాకుళం

- దాతల సహకారం, చేయూతతో శిక్షణ శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలకు క్రీడాపరికరాలు, క్రీడాదుస్తులు, షూ, సాక్సులు, స్నాక్స్, మెడల్స్, బహుమతులు, అందించేలా ఆయా కేంద్రాల శిక్షకులు చొరవ తీసుకోవాలి.

50 కేంద్రాల వివరాలు..

వాలీబాల్ (శ్రీకాకుళం హడ్కోకాలనీ, కొరసవాడ, కొర్ని, ప్రగాడపుట్టుగ, కొవ్వాడ, మబుగాం, కేశవరావుపేట), సాఫ్ట్‌బాల్ (కేశవరావుపేట, తొగరాం, మడపాం, మందస, జర్జంగి), కబడ్డీ (టెక్కలి, పల్లిసారథి, వడ్డితాండ్ర, సింగుపురం), అథ్లెటిక్స్‌కు (టెక్కలి డిగ్రీ కాలేజ్, ఇచ్ఛాపురం, బ్రాహ్మణతర్ల, శ్రీకాకుళం టీపీఎంహెచ్‌స్కూల్), బ్యాడ్మింటన్‌కు (పలాస ఇండోర్ స్టేడియం, కవిటి ఇండోర్ స్టేడియం, సోంపేట ఇండోర్ స్టేడియం), తైక్వాండో (శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్, సోంపేట, టౌన్‌హాల్ శ్రీకాకుళం, నరసన్నపేట), బాల్ బ్యాడ్మింటన్ (ఎచ్చెర్ల జీహెచ్‌స్కూల్, సానివాడ ఎంపీయూపీస్కూల్, టెక్కలి జీహెచ్‌స్కూల్), హ్యాండ్‌బాల్ (అల్లినగరం, పిల్లలవలస, శ్రీకూర్మం), ఖోఖో (పలాస, ఇచ్ఛాపురం), ఫుట్‌బాల్ (శ్రీకాకుళం, నరసన్నపేట), బేస్‌బాల్‌కు (లావేరు, ఇప్పిలి), బాక్సింగ్ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్, శ్రీకాకుళం పీఎస్ఎన్ఎంహెచ్‌స్కూల్), జూడో (పెద్దసాన, తాడివలస), బాస్కెట్‌బాల్ (టెక్కలి డిగ్రీ కాలేజ్), ఫెన్సింగ్ (శ్రీకాకుళం టౌన్ హాల్), నెట్‌బాల్ (టెక్కలి డిగ్రీ కాలేజ్), టెన్నీకాయిట్ (పలాస), రగ్బీ (సంతబొమ్మాళి), సెపక్‌తక్ర (శ్రీకాకుళం ఎన్టీఆర్ఎంహెచ్‌స్కూల్) ఉషూ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్) కేంద్రాలుగా శిక్షణ శిబిరాలు కొనసాగనున్నాయి.

అరసవల్లిలో వైశాఖి సందడి

- ఒక్కరోజులో రూ.11.96 లక్షల ఆదాయం
- విపరీతమైన రద్దీతో ఇబ్బంది పడిన భక్తులు

అరసవల్లి: వైశాఖ మాసం రెండో ఆదివారం సందర్భంగా అరసవల్లి ఆదిత్యుడికి పెద్ద ఎత్తున భక్తులు మొక్కులు చెల్లించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా ఇంద్ర పుష్కరిణి ఒడ్డున మహిళలు పెద్ద సంఖ్యలో సంప్రదాయ పూజలు చేసి స్వామికి ప్రసాదాలను నివేదించారు. ఎండ ప్రభావం భక్తులపై పడకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ పలు ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో ఇబ్బందులు తప్పలేదు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల తాకిడి అధికమైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు దర్శనాలకు బారులు తీరారు. ప్రతి క్యూ వద్ద మంచినీటి ప్యాకెట్లు, ఉచిత మజ్జిగ, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆదిత్యుడిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లోచర్ల రమేష్ తదితర ప్రముఖులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ దర్శనాలు చేయించారు.

భక్తులకు తప్పని ఇక్కట్లు

వైశాఖ ఆదివారం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో రావడంతో ఇబ్బంది తప్పలేదు. ఈశాన్య ద్వారం నుంచి కేశఖండన శాల మీదుగా వచ్చిన భక్తులకు ఎలా వెళ్లాలో తెలియలేదు. ఇంద్రపుష్కరిణిలో నీరు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత మహిళలంతా సంప్రదాయ పూజలంటూ ఉచిత దర్శనాల మార్గంలోనే పూజలను నిర్వహించారు. దీంతో ఉచిత దర్శనాల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సంప్రదాయ పూజలతో పుష్కరిణి ఒడ్డున భక్తజనం



ప్రత్యేక దర్శనాల క్యూలో భక్తుల రద్దీ

వైశాఖ రెండో ఆదివారం సందర్భంగా భక్తుల దర్శనాలు పెరగడంతో ఒక్కరోజులో రూ.11,96,876 ఆదాయం లభించింది. విశిష్ట, ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.7,98,800, పూజలు విరాళాల ద్వారా రూ. 68,076, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.30 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.

వైభవంగా 'కళావైభవ్' ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని చౌక్ బజారు రోడ్డులో నూతనంగా నెలకొల్పిన కళా వైభవ్ వస్త్ర దుకాణ సముదాయాన్ని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వస్త్ర దుకాణం నిర్వాహకులు మోహినీ, ధర్మేంద్రలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక కాలంలో అందరి అభిరుచులకు అనుగుణంగా ఇక్కడ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని మంత్రి ధర్మాన అన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పలువురు నేతలు పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రాలతో పాటు అధునాతన ట్రెండ్స్‌ను మేళవిస్తూ అద్భుతమైన వస్త్రాలతో ప్రారంభమైన కళా వైభవ్‌లో కొనుగోలుకు వినియోగదారులు తొలిరోజు ఎగబడ్డారు.



కళావైభవ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

కణితి సేవలు మరువలేనివి

పలాస: దివంగత మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం సేవలు మరువలేనివని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని కణితి విశ్వనాథం స్వగృహం ఆవరణలో ఆదివారం కుటుంబ సభ్యులు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వనాథం వైద్య వృత్తిలో రోగులకు అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా 50 ఏళ్ల క్రితమే మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించి ప్రజా వైద్యునిగా గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గొర్లు శిరీష, పేరాడ తిలక్, బల్ల గిరిబాబు, వజ్జ బాబూరావు, దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ శ్రీధర్, హేమబాబు చౌదరి, పాలవలస వైకుంఠరావు, కోత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకూర్మనాథుని కల్యాణ మహోత్సవానికి సిద్ధం

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఉత్సవాల్లో ప్రముఖమైన కల్యాణోత్సవం వైశాఖ మాస ఏకాదశి సందర్భంగా సోమవారం నిర్వహించనున్నారు. ఉత్సవం కోసం దేవస్థాన అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే తొమ్మిది రోజుల పాటు జరిగిన వేడుకల్లో పందిరి రాట, అంకురార్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కూర్మనాథుని ఆవిర్భావం నుంచి ఈ కల్యాణం జరుగుతోంది. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచి వచ్చిన బియ్యంతో స్వామి కల్యాణం రోజున నైవేద్యం చేసి నివేదిస్తారు. సాయంత్రం స్వామి కల్యాణ మూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తారు.

వైభవంగా కొట్నం దంపు

శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం వేళలో ఆలయంలో వైభవంగా కొట్నం మహోత్సవం నిర్వహించారు. తిరుక్కల్యాణం ముందు రోజు జరిగే ఈ కొట్నం దంపు ముత్తైదువులతో శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు విశేష అర్చనలు, హోమాలను ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం వేళ ఆస్థాన మంటపంలో స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామిలను వేంచింపచేసి రాజా వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వక్సేన పూజ, పరిషత్ వంటి వైదిక క్రియలు జరిగాయి. అనంతరం కొట్నం దంపు కోసం వినియోగించే కర్ర రోలుకు ప్రత్యేక పూజలు చేసి, లక్ష్మీదేవికి పూజ అనంతరం కొట్నం దంపు ప్రారంభించారు. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచగా వచ్చిన బియ్యంతో ప్రసాదాన్ని తయారు చేసి స్వామికి నివేదిస్తారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్ బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొట్నం దంపు జరుగుతున్న దృశ్యం

మెతుకు వెతుకులాటలో..



మెతుకు వెతుక్కుంటూ వచ్చిన బతుకులివి. ఇల్లూ వాకిలి విడిచి పిల్లాపాపలతో ఊరూరూ సంచరిస్తూ రోజులు గడిపే జీవితాలివి. ఎక్కడో తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా జనగాంకు చెందిన కొంత మంది సంచార జాతి కుటుంబాల వారు టెక్కలి పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రాణాలు అరచేత పట్టుకుని సర్కస్ చేస్తున్నారు. ఉదయం వారికి అనుకూలమైన ప్రాంతంలో బస చేస్తున్నారు. ఇలా టెక్కలి వంశధార కార్యాలయం ఆవరణలో సంచార జాతి కుటుంబాలు చంటి బిడ్డలతో సహా బస చేయడం కనిపించింది.

– టెక్కలి

సంబరాల సమయం

వసంత కోకిల సంబరాల సమయాన్ని చాటింపు వేస్తుంది. కొత్త చిగురుపై చైత్ర కిరణాలు ప్రకాశించే కాలంలో పల్లె పెద్ద ముత్తైదువులా ముస్తాబవుతుంది. చైత్రం పోయి వైశాఖం వచ్చే వేళలో ఊరు హోరెత్తేలా ఉత్సవ ఉత్సాహం ద్విగుణీకృతమవుతుంది. జ్యేష్టం, ఆషాడం వరకు పల్లె వాకిట చీకటి అడుగు పెట్టదు. తప్పెటగుళ్ల చప్పుళ్లు, విద్యుత్ దీపాల వెలుగులు, బంధువుల రాకపోకలతో గ్రామంలో సంబరాల సంగ్రామం జరుగుతుంది. సిక్కోలు పల్లెలకు ఇది సంబరాల సమయం.

- పల్లెల్లో గ్రామదేవత సంబరాలు
- ఉపాధి పొందుతున్న కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: పల్లె పెద్ద ముత్తైదువులా కనిపిస్తోంది. ఊరి అమ్మవారికి సంబరాలు, గ్రామ దేవతలకు చల్లదనాలు, వేడుకలు, ఉత్సవాలతో విశ్వరూప విన్యాసం చేస్తోంది. చైత్రంలో కోయిల కూత వినిపించింది మొదలు సంబరాల సమయం ఆసన్నమైంది. స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవం మొదలు పెద్దమ్మ ఉత్సవం, శ్యామలమ్మ, కాళమ్మ, బాల త్రిపుర సుందరి, అసిరిపోలమ్మ.. ఇలా గ్రామ దేవతల ఉత్సవాలతో పల్లెల్లో సందడి నెలకొంది.

చల్లదనాలతో మొదలు..

ఒకనాడు నిత్యం కరువు కాటకాలు కన్నీళ్లతో సావాసం చేసిన గ్రామాలు.. ఆ పరిస్థితుల నుంచి బయటపడడానికి అమ్మవార్లను నమ్ముకున్నాయి. తల్లులకు చల్లదనం చేస్తే తమ ఊరిని చల్లగా చూస్తాయని భావించి చల్లదనం సంబరాలు చేసేవారు. ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. చైత్ర మాసం మొదలైన నుంచి జ్యేష్ట మాసం వరకు పల్లెల్లో గ్రామ దేవతలకు చల్లదనం చేయడం సిక్కోలు జిల్లా వాసుల ఆచారం. ఈ సమయాల్లో సహజ సిద్ధంగా పండిన తాజా జీడి, మామిడి, పనస, పైనాపిల్ వంటి ఫలాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ఆది, మంగళ, గురువారాల్లో పొలిమేరలో ఉన్న దేవతలకు మేళ, తాళాలతో వెళ్లి మొక్కుబడులు తీర్చుకుంటారు. మెండుగా వర్షాలు పడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ అమ్మవార్లకు కొత్త బట్టలు కానుకగా ఇస్తారు.

కళాకారులకు ఉపాధి

వేసవి నుంచి కాస్త వానలు పడే సమయం వరకు కళాకారులకు ఇక్కడ చక్కటి ఉపాధి లభిస్తోంది. ఈ ఉత్సవాలు జరిగే సమయాల్లో క్షణం తీరుబాటు లేకుండా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. అమ్మవారి సన్నాయి మేళం కళాకారులు, వీధి వేషధారణలు వేసే కళాకారులు, కోయ నృత్యం, అంజాట, తప్పెట గుళ్లు, పాములోళ్లు, డప్పు కళాకారులు, కాళికా వేషధారణ, పులి, సింహాల వేషధారులు, కోలాటం కళాకారులు..ఇలా ఒకటేమిటి వందలాది మంది కళాకారులకు ఈ ఉత్సవాలు ఉపాధి కల్పిస్తుంటాయి. వీధుల్లో చిన్నపాటి దుకాణాల నుంచి సర్కస్, జాయింట్ వీల్, డిస్కో చైర్స్ వంటి పరికరాలతో ఉపాధి పొందుతుంటారు వ్యాపారులు.



గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఊరేగింపు



పొలిమేర దేవతలకు ఘటాలతో భక్తుల చల్లదనం

22 ఏళ్ల తర్వాత..



22 ఏళ్ల తర్వాత మా గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. అలాగే ఏటా ఏప్రిల్, మే నెలల్లో పొలిమేర దేవతలకు ఉత్సవాలు, చల్లదనాలు చేయడం ద్వారా పాడి పంటలకు కొదవ ఉండదు. ప్రజలంతా సుభిక్షంగా ఉంటారన్నది సత్యం. ప్రస్తుతం పండే ఫలాలే అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తుంటాం.

– దక్కత నూకయ్యరెడ్డి, గ్రామ పెద్ద, తేలుకుంచి

క్లుప్తంగా

గంగా పుష్కరాలకు ప్రత్యేక బస్సు



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎం మాధవ్

శ్రీకాకుళం అర్బన్: కాశీలో గంగా పుష్కరాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం-1 డిపో నుంచి బయలుదేరింది. ఈ బస్సును శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 3వ వరకు పుష్కరాలు జరుగుతాయన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో 36 మంది యాత్రికులు బయలుదేరి వెళ్లారని తెలిపారు. మే 2న కాశీలో బయలుదేరి 3వ తేదీ సాయంత్రం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, గ్యారేజ్ ఇన్‌చార్జి రాజు, ఎంపీ రావు, రాజు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యాలయ పాలక మండలి తొలి సమావేశం నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కొత్త పాలక మండలి (ధర్మకర్త) సభ్యుల తొలి సమావేశం సోమవారం ఉదయం 10 గంటల నుంచి ట్రస్ట్ బోర్డు మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 మంది సభ్యులతో కూడిన పాలక మండలిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నియమించిందని, తొలి సమావేశానికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు అధ్యక్షత వహిస్తారని ప్రకటించారు. గౌరవ పాలకమండలి సభ్యులంతా హాజరుకావాలని, కేవలం సభ్యులకు మాత్రమే సమావేశంలో అనుమతి ఉంటుందని ఈవో స్పష్టం చేశారు.

మంత్రిని కలిసిన యూహెచ్‌సీ చైర్మన్లు



మంత్రి ధర్మాన ప్రసాదరావుతో అర్బన్ హెల్త్ సెంటర్ల చైర్మన్లు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతనంగా నియమితులైన చైర్మన్లు ఆదివారం పెదపాడులో మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మొదలవలస రాజేంద్రకుమార్, డి.రమేష్ రాజు, డి.పి.దేవ్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ నిజాయితీ



భాస్కరరావుకు నగదు అందజేస్తున్న టైలర్ మధు

పాతపట్నం: పాతపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద రూ.2.50 లక్షల నగదు చాకిపల్లి గ్రామానికి టైలర్ కనకాల మధుకు ఆదివారం దొరికింది. వెంటనే ఆ నగదును పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించి నిజాయితీ చాటుకోవడంతో పలువురు అభినందించారు. పాతపట్నం కొత్త దేవాంగుల వీధి దిగువ ఉంటున్న బర్ల భాస్కరరావు ఆదివారం ఏటీఎంలో లక్ష రూపాయలు డిపాజిట్ చేసి మిగిలిన రూ.2.50 నగదు మరిచిపోయారు. భాస్కరరావు నగదు పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో టైలర్ మధు నగదు తీసుకురావడంతో ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు సమక్షంలో ఆ మొత్తాన్ని భాస్కరరావుకు అందజేశారు. టైలర్ మధు నిజాయితీని మెచ్చుకుని భాస్కరరావు రూ.10 వేలు నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు జీవరత్నం, రైటర్ శంకర్ ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930–00
బంగారం(22సి. 10గ్రా.)	55,850–00
వెండి (కిలో)	80,400–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

అరకొరగా ఎగుమతులు

- ఉద్దానంలో 'కొబ్బరి ఈనె'ల వ్యాపారానికి గడ్డుకాలం
- కంచిలి మార్కెట్‌పై ఇండోనేషియా సరుకు ప్రభావం
- ఆందోళనలో రైతులు, వ్యాపారులు



కంచిలిలో ఓ వ్యాపార సంస్థలో నిల్వ ఉన్న కొబ్బరి ఈనెలు

కంచిలి: జిల్లాలో కొబ్బరివ్యాపారానికి పెట్టింది పేరు ఉద్దానం. ఈ ప్రాంతంలో కొబ్బరికాయల నుంచి కొమ్మల ఆకుల నుంచి వేరే చేసే ఈనెలు వరకు రైతులకు లాభాలు తెచ్చిపెట్టేవి. అయితే వివిధ కారణాల వల్ల ఇప్పుడా పరిస్థితి లేదు. కొబ్బరితోపాటు అనుబంధంగా ఉన్న అన్ని పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. తాజాగా కొబ్బరి 'ఈనె'ల వ్యాపారం కూడా మూతపడే జాబితాలో చేరబోతోంది.

ఇదీ పరిస్థితి..

ఉద్దానంతోపాటు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఈనెలు కంచిలి మార్కెట్‌కు వచ్చేవి. ఇక్కడ చీపుర్లను తయారు చేసి నుంచి ఉత్తరాది రాష్ట్రాలతోపాటు విదేశాలకు ఎగుమతి చేసేవారు. కొబ్బరి ఈనెలు ఆర్డినరీ రకం కిలో రూ.25, స్పెషల్ రకం రూ.45కు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కంచిలి మార్కెట్‌లోని 15 వ్యాపార సంస్థల నుంచి ప్రతి నెలా 25 వరకు లారీల లోడ్లు ఎగుమతులు అయ్యేవి. కొన్నాళ్లుగా మన దేశానికి ఇండోనేషియా దేశం నుంచి పెద్ద ఎత్తున కొబ్బరి ఈనెలు దిగుమతి అవుతున్నాయి. ఇక్కడి కంటే నాణ్యతగా, చూడేందుకు ఇంపుగా ఉండటం, తక్కువ ధరకు లభ్యం కావడంతో మార్కెట్ అంతా అటువైపు మళ్లింది. ఇండియాతోపాటు పాకిస్తాన్ తదితర దేశాలకు కూడా ఇండోనేషియా మార్కెట్ నుంచే సరకు రవాణా అవుతోంది. దీంతో ఆ ప్రభావం మన మార్కెట్‌పై పడింది. ఉద్దానం ప్రాంతంలో సరకు రవాణా చేసే కంచిలి మార్కెట్ నుంచి ప్రస్తుతం నెలకు 5 నుంచి 6 లోడ్లు మాత్రమే ఎగుమతవుతున్నాయి. ఇలా ఎగుమతులు దిగజారిపోవడంతో ఈ వ్యాపారంపై ఆధార పడిన వారంతా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరకు ఉత్పత్తి చేసిన రైతుల వద్ద నుంచి తోటల్లో ఆకుల నుంచి ఈనెల్ని వేరు చేసే కూలీలు, వ్యాపారులు, వ్యాపార సంస్థలో వాటిని సరిచేసి, ప్యాకింగ్ చేసే కూలీలు, వాటి ప్యాకింగ్‌కు ఉపయోగించే గోనెల వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టు వాహనాల యజమానులు, వాటి కూలీలు ఇలా అందరూ పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.



ఇండోనేషియాలో ఉత్పత్తయిన కొబ్బరి ఈనెలు

ప్యాకింగ్‌కు నష్టాలే..



కొబ్బరి ఈనెలను క్రమపద్ధతిలో తయారు చేసిన తర్వాత లోడింగ్ చేసేందుకు వీలుగా ప్యాకింగ్ చేసే గోనెల్ని ఉపయోగిస్తారు. పెద్ద ఎత్తున గోనెల్ని వినియోగించడంతో మా వ్యాపారం చక్కగా సాగేది. ప్రస్తుతం ఈనెల ఎగుమతులు భారీగా తగ్గడంతో వ్యాపారం లేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది.

– రాము, గోనె సంచుల వ్యాపారి, కంచిలి

అగమ్యగోచరం..



కొబ్బరి ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమలు నష్టాలబాటలో పయనిస్తుండటంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొబ్బరి ఆకుల నుంచి వేరేచేసే ఈనెల వల్ల ఏడాది మొత్తంగా ఎంతో కొంత లాభం రావడం వల్ల కొన్ని ఖర్చులకు పనికొచ్చేవి. ఇప్పుడు ఈనెలకు డిమాండ్ తగ్గడంతో నష్టపోవాల్సి వస్తోంది.

– తాండ్ర సురేష్, కొబ్బరి రైతు, పెద్దశ్రీరాంపురం, కంచిలి మండలం

తగ్గిన ఎగుమతులు..



కొబ్బరి ఈనెల వ్యాపారం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ఇండోనేషియా నుంచి నాణ్యమైన, తక్కువ ధరకు కొబ్బరి ఈనెలు దిగుమతి అవ్వడంతో ఇక్కడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక్కడ సరకుకు డిమాండు బాగా తగ్గి ఎగుమతులు దిగజారిపోయాయి.

– ముకుల్‌కుమార్ హల్దర్, కొబ్బరి ఈనెల వ్యాపారి, కంచిలి

నీలమణి దుర్గ పండగకు పకడ్బందీ ఏర్పాట్లు

- కమిటీ, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- అధికారులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి. చిత్రంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గమ్మ అమ్మవారి పండగలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులకు ఆదేశించారు. పాతపట్నంలో మే 21 నుంచి 30 వరకు ఉత్సవాలు జరగనున్న సందర్భంగా కమిటీ, అధికారులను సమన్వయ పరిచేందుకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అందరి భాగస్వామ్యం, సహకారంతో పండగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కంట్రోల్ రూమ్ నిర్వహించాలన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ హరిసూర్యప్రకాష్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు, పాతపట్నం ప్రెసిడెంట్ జోగారావు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పోలితాత సంబరం



జి.సిగడాం మండలం చెట్టుపొదిలాంలో పోలితాత సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆదివారం రథాలపై పోలితాతను ఊరేగించారు. వందలాది మహిళలు ముర్రాటలతో వెళ్లి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

– జి సిగడాం

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-6 ఆధ్వర్యంలో సంత సీతారాంపురంలో వారం రోజులుగా నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలు, బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పర్సంటేజీ ఎక్కువగా ఉన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ, శిబిరం పీఓ డాక్టర్ గుండ స్వాతి, నాయకులు పాల్గొన్నారు.

'మేడే' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: నగరంలోని రిమ్స్ ఆస్పత్రి వద్ద అంతర్జాతీయ శ్రామిక దీక్షా దినోత్సవం మే డే సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, రిమ్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుమ్ము సింహాచలం, రిమ్స్ సెక్యూరిటీ యూనియన్ కన్వీనర్ అన్నెపు సూర్యనారాయణలు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం జరగాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో దుమ్ము చిన్నారావు, పద్మ, దుర్గ, నక్క శశి, పాలురి బిబి, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆత్మీయ సమ్మేళనం



ఒకేచోటకు చేరిన 1984-86 బ్యాచ్ విద్యార్థులు

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1984–86 బ్యాచ్ ఇంటర్మీడియట్ సైన్సుగ్రూప్ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఒకేచోటకు చేరి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు చదువులు నేర్పిన పూర్వ అధ్యాపకులు కె.ఉపేంద్రరావు, ఆర్.రాంబాబు, కె.ఎస్.ఎల్.కుమారి, విశ్వేశ్వరరావు, సాయిరాజులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఆకట్టుకున్న ద్విగళావధానం



ద్విగళావధానంలో పాల్గొన్న అవధానులు

పలాస: కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో ఆదివారం లలిత కళారంజని ఆధ్వర్యంలో జరిగిన ద్విగళావధానం సాహిత్యప్రియులను విశేషంగా ఆకర్షించింది. లలిత కళారంజనీ అధ్యక్షుడు కె.చిన్నాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవధానులు సుసరాపు చంద్రశేఖరశర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, రంప సాయికుమార్ శర్మలు పాల్గొన్నారు. బందరు దుర్గా ప్రసాద్, కోత ఉపేంద్రరావు, గుమ్మడి సాంబమూర్తి, పూడి లక్ష్మీపతి, భేరి చక్రపాణి, కణితి ఈశ్వరరావు, నిర్విశానంద స్వామి, ఇప్పిలి ఏకాహం తదితరులు ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా చిన్నాచారి మాట్లాడుతూ ద్విగళావధానం అనే ప్రక్రియ తెలుగు సాహిత్యంలో వినూత్నమైనదన్నారు. అందరూ ఆదరించాలని కోరారు. బూర్జి కోటేశ్వరరావు మాట్లాడుతూ లలిత కళారంజనీ సాహితీ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సాహితీకారులు పెంట ఓంప్రకాష్, శివజ్యోతి, నిశితాసి, తంగుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాహనంతో ఢీకొట్టి.. నీటిగుంతలో పడేసి..



గుంతలో ముదిలి జగన్ మృతదేహం (ఇన్‌సెట్లో) జగన్(ఫైల్)

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడులో ఉన్నత పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ముదిలి జగన్ (57) శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ముదిలి జగన్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులకు సంబంధించిన మెటీరియల్ పర్యవేక్షణకు ఇటీవల నియమించారు. శనివారం రాత్రి స్కూల్‌కు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేక పోవడాన్ని గమనించిన వాహనదారులు రైతు భరోసా కేంద్రం పక్కనున్న నీటి గుంతలో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. భర్త ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య పగడాలు వెతకసాగింది. నీటి గుంత సమీపంలో చెప్పులు కన్పించడంతో అక్కడికి వెళ్లి చూడగా భర్త మృతదేహం కన్పించింది. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అప్పారావు సంఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు.

అదుపు తప్పి.. బస్సును ఢీకొట్టి..



మృతుడు రాజేశ్వరరావు

నరసన్నపేట: జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డులో నరసన్నపేట డంపింగ్ యార్డు మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం మబగాంకు చెందిన బొంగు రాజేశ్వరరావు (54) మృతి చెందారు. నరసన్నపేటలో పని ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు ఎక్కే మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఆయన మృతికి కారణమయ్యాయి. స్పీడ్ బ్రేకర్ వద్ద ఆర్టీసీ బస్ బ్రేకు వేయడంతో వెనుక ద్విచక్ర వాహనంతో వస్తున్న రాజేశ్వరరావు అదుపు తప్పి బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టాడు. కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స ప్రారంభించే లోపే రాజేశ్వరరావు మృతి చెందారు. మృతునికి భార్య కల్యాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మడపాం టోల్‌గేట్‌లో పనిచేస్తూ ఎల్‌ఐసీ ఏజెంట్‌గా రాజేశ్వరరావు పనిచేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యువతి ఆత్మహత్య



గీత మృతదేహం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరుకు చెందిన పెదకోట గీత(37) అనే వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బాధితురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన పెదకోట భాస్కరరావుతో ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌కు చెందిన బెవర గీతకు 2007లో వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత గీతను అనుమానిస్తూ భర్త భాస్కరరావు, మామయ్య జగన్నాథం, అత్త రెయ్యమ్మలు శారీరకంగా, మానసికంగా వేధించేవారు. పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. ఈ క్రమంలోనే గీత ఇంట్లో ఉరివేసుకోగా కుటుంబ సభ్యులు గమనించి కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ వైద్యులు నిర్ధారించారు. బాధితురాలి తల్లి తవిటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోవింద కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గీతకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కామయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై జరజాం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డి కామయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లావేరు మండలం మురపాకకు కామయ్య శ్రీకాకుళంలో గృహ నిర్మాణ పనికి వెళ్లి బైక్‌పై స్వగ్రామం తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో తోటి కార్మికులు 108 శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి



ముద్దాడ విష్ణు మృతదేహం

పొందూరు: మండలంలోని కనిమెట్ట గ్రామంలో ముద్దాడ విష్ణు(50) చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం కోనేటికి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మునిగిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో విషయం తెలియలేదు. సాయంత్రం కోనేటి పక్కన కర్ర, చెప్పులు కనిపించడంతో దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ లక్ష్మణరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కారు ఢీకొని మెకానిక్..



బి.వేణుగోపాల్(ఫైల్)

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో స్నేహ షాపింగ్ మాల్ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ట్రాక్టర్ మెకానిక్ బోరాడ వేణుగోపాల్ (33) మృతి చెందాడు. ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. వేణుగోపాల్ పాతపట్నం నుంచి పర్లాకిమిడి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఎల్.ఎన్.పేటకు చెందిన వ్యక్తి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణుగోపాల్ తలకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వేణుగోపాల్ మృతి చెందాడు. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు ఘటన స్థలం వద్దకు వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఎల్.ఎన్.పేట కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడికి భార్య అయ్యన్న షర్మిల, పాప దీవెన, బాబు సింహాద్రినాయుడు ఉన్నారు. భార్య షర్మిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకుని రాజస్థాన్ యువకుడు ఆత్మహత్య



మనోజ్ కుమార్ (ఫైల్)

నరసన్నపేట: బతుకు తెరువు కోసం రాజస్తాన్ నుంచి నరసన్నపేటకు వచ్చిన మనోజ్‌కుమార్ (32) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రం నాగూర్ జిల్లా కతోడీ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ రెండేళ్ల క్రితం నరసన్నపేట వచ్చాడు. స్థానిక పాతబస్టాండ్ వద్ద శివాలయం ఎదురుగా ఉన్న సంపత్ రెసిడెన్సీలో నివాసముంటూ నిమ్మాడ జంక్షన్‌లోని జితిన్ గ్రానైట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కంపెనీకి వెళ్లకపోవడంతో స్నేహితుడు అపార్ట్‌మెంట్‌కు వచ్చి చూశాడు. మనోజ్ నివాసం ఉంటున్న ప్లాట్ పరిశీలించగా ఉరి వేసుకుని కనిపించడంతో నరసన్నపేట పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి భార్య, పిల్లలు కతోడీలో నివసిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియలేదు. ఎస్‌ఐ వై.సింహాచలం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.